



# కరపత్రం

SINCE 2014

శనివారం సెప్టెంబర్ 27 2025 | సంపుటి :0 | సంచిక :339 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## మహిళల ఖాతాల్లో రూ.10వేలు

## ఎన్నికల వేళ బిహార్ బొనాంజా



- ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన.
- నగదు బదిలీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున నగదు జమ చేశారు.
- ప్రారంభం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ఈ పథకాన్ని ప్రారంభించి, నగదు బదిలీ చేశారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ మరియు ఇతర మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం అక్కడి మహిళలకు నవరాత్రి కానుక అందించింది . ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' ప్రారంభించడం ద్వారా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేశారు. దిల్లీలో ఉన్న మోదీ వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, ఇతర మంత్రులు హాజరయ్యారు. రూ.7,500 కోట్లతో బిహార్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. పేజి 2లో ▶



## 63 ఏళ్ల పాటు సేవలు..

## మిగ్-21కు గుడ్‌బై

భారత వాయుసేనకు కొన్ని దశాబ్దాలుగా వెన్నుముకలా ఉండి.. ఎన్నో యుద్ధాల్లో విజయాన్ని అందించిన మిగ్-21 కు వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ వీడ్కోలు పలికారు. శుక్రవారం చండీగఢ్ వాయుసేన కేంద్రం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. దీనికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఐఏఎఫ్ సీనియర్ అధికారులు, మాజీలు హాజరయ్యారు. పేజి 2లో ▶

## అమెరికా ప్రసంగం వివాదం..

### హైకోర్టులో రాహుల్ గాంధీకి చుక్కెదురు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అలహాబాద్ హైకోర్టులో చుక్కెదురైంది. తన వ్యాఖ్యలపై దర్యాప్తునకు వారణాసి ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. పేజి 2లో ▶

## వీలైనంత త్వరలోనే అమెరికాతో ఒప్పందం: వాణిజ్య శాఖ




భారత్, అమెరికా లకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

### మూసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత




మిగతాది 2లో

## ప్రజలను అప్రమత్తం చేయండి:

### కలెక్టర్లకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



- జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.
- వాతావరణ శాఖ సూచనల మేరకు, ఈరోజు, రేపు (సెప్టెంబర్ 26, 27) కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి.
- లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితులు ఉన్నచోట ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని మరియు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్: గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో గురువారం (సెప్టెంబర్ 25) రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం దంచికొట్టింది. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో శుక్రవారం (సెప్టెంబర్ 26) సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో లగ్జరీ కార్ల డీలర్ బసరత్ ఖాన్ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు




## దసరా రద్దీ.. తాత్కాలిక స్టాప్‌లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే



మిగతాది 2లో

## ఎల్ అండ్ టీ నిష్క్రమణ.. తెలంగాణ ప్రభుత్వానికి మాయని మచ్చ: కేటీఆర్




హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ మెట్రోకు మంచి డిమాండ్ ఉండేదని, తాము దిగిపోయే నాటికి దేశంలోనే రెండో అతిపెద్ద వ్యవస్థగా ఉందని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.

## కన్నతల్లే కాల సర్పం అయ్యింది..

### జనవరిలో ఒక కొడుకు.. ఇప్పుడు మరో కొడుకు హత్య..



అప్పుడప్పుడే మాటలు నేర్చుకుంటూ.. ముద్దు ముద్దు పలుకులు పలుకుతూ.. చిరు చిరు అడుగులు వేస్తూ.. అమ్మ వేలు వదలకుండా ఉండే చిన్నారులంటే ఏ తల్లికైనా ఎంతో అపురూపం. ఆ వయసులో వాళ్లకు ప్రతీది ప్రశ్నే.. అన్నింటికీ సమాధానం చెబుతూ వాళ్లను తీర్చిదిద్దే మొదటి గురువు.. జీవిత ప్రధాత అమ్మ. కానీ ఈ అమ్మ మాత్రం వాళ్ల పాలిట యమపాశంలా తయారైంది. జనవరిలో ఒక కొడుకును పొట్టనపెట్టకున్న తల్లి.. ఇప్పుడు మరో కొడుకు మెడకు నైలాన్ తాడు చుట్టీ చంపేయడం ఆ అమ్మతనమే చినబోయే ఘటన. పేజి 2లో ▶

## స్థానిక సంస్థల ఎన్నికలు.. బీసీ రిజర్వేషన్లపై జీవో జారీ

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఈ దిశగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమశాఖ జీవోను విడుదల చేసింది. డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో నంబర్ 9ని విడుదల చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50% పరిమితిని ఎత్తివేసి, బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు(జీవో) ఇవ్వాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించిన సంగతి తెలిసిందే. మరోవైపు సెప్టెంబరు 30లోపు ఎన్నికలు జరగాలని హైకోర్టు గడువు నిర్దేశించినందున దానికి అనుగుణంగా 42% బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం జీవో జారీ చేసింది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మనకే అవకాశాలెక్కువ: కేసీఆర్




- సమావేశ స్థలం మరియు తేదీ: శుక్రవారం (సెప్టెంబర్ 26) ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరిగింది.
- పాల్గొన్న ప్రముఖులు: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.
- ముఖ్య చర్చనీయాంశం: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

## మన ప్రజాస్వామ్య కురుక్షేత్రం ధర్మక్షేత్రమేనా

భారతదేశ ఎన్నికలు స్వేచ్ఛాయుతమూ, న్యాయబద్ధమైనవేనా? పాలక పక్షం పాల్పడుతున్న ఎన్నికల అక్రమాలు ఓటర్ జాబితాలను రూపొందించే దశ నుంచే ప్రారంభమవుతున్నాయని, ఇందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తోడ్పడుతోందని ఆరోపిస్తూ ఆ రాజ్యాంగ సంస్థకు...భారతదేశ ఎన్నికలు స్వేచ్ఛాయుతమూ, న్యాయబద్ధమైనవేనా? పాలక పక్షం పాల్పడుతున్న ఎన్నికల అక్రమాలు ఓటర్ జాబితాలను రూపొందించే దశ నుంచే ప్రారంభమవుతున్నాయని, ఇందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తోడ్పడుతోందని ఆరోపిస్తూ ఆ రాజ్యాంగ సంస్థకు వ్యతిరేకంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేస్తున్న రాజీలేని పోరాటంతో ప్రారంభమైన చర్చ అది. ప్రశస్త సేవలు అందిస్తున్న ఒక ప్రజాస్వామిక సంస్థను అప్రతిష్ఠపాలు చేసేందుకే కాంగ్రెస్ నాయకుడు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మోదీ ప్రభుత్వ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. అధికారంలో ఉన్నవారికి ఇబ్బందికరమైన ప్రశ్నలు సంధించేందుకు సాహసించిన ఏకైక నాయకుడు రాహుల్ అని ఆయన విధేయులు వాదిస్తున్నారు. ఈ వాదప్రతివాదాల రణగొణ ధ్వనిలో మన మౌలిక ప్రశ్న%–% భారతదేశంలో ఎన్నికలు నిజంగా స్వేచ్ఛాయుతంగా, పక్షపాతరహితంగా జరుగుతున్నాయా? అన్నదానిపై నిష్పాక్షిక సమాధానాన్ని కోల్పోయింది.ఆ ప్రశ్నకు సమాధానంగా నేను ఒక ప్రతిపాదన చేస్తున్నాను: భారతదేశంలో ఎన్నికలు చాలావరకు స్వేచ్ఛాయుతమే కానీ అవి తప్పకుండా నిష్పాక్షికంగా జరుగుతున్నాయని చెప్పలేము. జవహర్‌లాల్ నెహ్రూ (అవును, ఇప్పుడు విమర్శలు అవహేళనలకు గురవుతున్న ఆదర్శవాది నెహ్రూజీ) స్వాతంత్ర్యానంతరం సమస్త భారత ప్రజలకు వయోజన ఓటు హక్కు లభింపచేయడంలో ప్రముఖపాత్ర వహించారు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు కల్పించడం చరిత్రలోనే అతి పెద్ద జూదం అని రాజ్యాంగ సభలో చాలామంది కొట్టివేశారు. భారత గణతంత్ర రాజ్యం మరింతగా విచ్ఛిన్నమయ్యేందుకే అది దారి తీస్తుందని కూడా వారు హెచ్చరించారు. 18 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎన్నికల ప్రజాస్వామ్యం పట్ల తన నిబద్ధత ‘జూదం’ కాదని, భవిష్యత్‌ను సముజ్వలంగా నిర్మించేందుకు ఉద్దేశించిన ప్రజాస్వామిక పెట్టుబడి అని, అది సమున్నత చరిత్రాత్మక లబ్ధిని సమకూర్చిందని గట్టిగా వాదించే సౌలభ్యాన్ని నెహ్రూకు చరిత్ర సమకూర్చింది. 1952లో ప్రప్రథమ సార్వత్రిక ఎన్నికలు ఆరు నెలల పాటు జరిగాయి. వాతావరణ సంబంధమైన, ఏర్పాట్ల పరమైన సవాళ్ల కారణంగా ఆ ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. దేశవ్యాప్తంగా 1.96 లక్షల పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో 27,527ను మహిళలకు రిజర్వ్ చేశారు. ఆనాడు దేశంలో 17.32 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. వారిలో 45 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2024లో 18వ సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో అర్హులైన ఓటర్లు 96.8 కోట్ల మంది ఉన్నారు. దేశ వ్యాప్తంగా 10.5 లక్షల పోలింగ్ కేంద్రాల నేర్పాటు చేశారు. అర్హులైన ఓటర్లలో 64.6 కోట్ల మంది ఓటర్లు అంటే, 65.9 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.కిరాయి గూండాలు పోలింగ్ బూత్‌లను పూర్తిగా స్వాధీనం చేసుకున్న రోజులు, దేశంలోని కొన్ని ప్రాంతాలలో బోగస్ ఓటింగ్ అనేది ఒక పరిపాటిగా ఉన్న రోజులు కూడా గుర్తు చేసుకుందాం. ఒక పోలింగ్ బూత్‌ను ‘స్వాధీనం’ చేసుకున్న ఘటనకు నేను ఒక ప్రత్యక్ష సాక్షిని. 1990లో మహారాష్ట్ర విధానసభ ఎన్నికలలో ముంబైలోని ఉమేర్‌ఖాది ప్రాంతంలో ఆ ఘటన చోటుచేసుకుంది. మతపరమైన భావోద్రేకాలు ప్రబలంగా ఉన్న పరిస్థితుల్లో ఆ ఎన్నికలు జరిగాయి. ముంబైలోని ఒక నియోజకవర్గంలో శివసేన, ముస్లింలీగ్ అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నారు. ఇరుపక్షాలవారు పోలీసులను లెక్కచేయకుండా పోలింగ్ బూత్‌లను స్వాధీనం చేసుకుని బ్యాలెట్ పత్రాలపై తమ అభ్యర్థికి అనుకూలంగా ముద్రలు వేశారు. అప్పటికి ఇంకా ఈవీఎమ్‌లు లేవు. టీవీ చానెల్స్ ముందునాటి రోజులవి.ఓటర్లు ఇప్పుడు గతంలో కంటే చాలా చైతన్యశీలురుగా ఉన్నారు. తమ ప్రజాస్వామ్య హక్కుల గురించి వారికి మెరుగైన అవగాహన ఉన్నది. గత కాలంలో జాట్ దబాంగ్ (శక్తిమంతులు)లు సృష్టించిన దౌర్జన్యపూరిత పరిస్థితుల కారణంగా తమ తమ అవ్వలు, తాతలు, తల్లిదండ్రులు ఓటు వేయలేకపోయేవారని హర్యానాలో నా పర్యటనల సందర్భంగా గ్రామీణ దళితులు పలువురు వివరించారు. అణగారిన కులాల వారిలో ప్రజాస్వామిక చైతన్యం బాగా ఉన్న రోజులివి. ప్రస్తుత కాలంలో అందునా 24 గంటల న్యూస్ చానెల్స్ యుగంలో అటువంటి ఘటనలు జరగడం అసంభవమే. అనేక అసమానతలు ప్రబలంగా ఉన్న మన సమాజంలో ఓటింగ్ రోజు ఒక విధంగా అరుదైన పౌర సమానత్వం వర్ధిల్లే శుభదినంగా ఉన్నది. ఆ రోజున జామ్‌నగర్ ఆయిల్ రిఫైనరీ కార్మికుడికి, ముకేశ్ అంబానీకి ఒకే విధమైన ఓటింగ్ హక్కు ఉంటుంది. ముంబైలోని ధారావి మురికివాడ వాసి కూడా గౌతమ్ అదానీలా ఠీవిగా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశిస్తాడు.

## దసరా రద్దీ.. తాత్కాలిక స్టాప్‌లను ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా.. ఈనెల 26 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు పదిరోజుల పాటు తాత్కాలిక రైళ్ల స్టాప్‌లను ప్రకటించింది. సికింద్రాబాద్ స్టేషన్ నుంచి వెళ్లే రైళ్లు...హైటెక్ సిటీ, లింగంపల్లి, చర్లపల్లి స్టేషన్లలో కూడా ఆగుతాయని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ప్రయాణికులు సికింద్రాబాద్ స్టేషన్‌కు రాకుండానే.. ఆయా స్టేషన్ల నుంచే ప్రయాణించే వెసులుబాటు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి చేసింది.

హైటెక్ సిటీ స్టేషన్: విశాఖపట్నం–లింగంపల్లి, హడప్సర్–కాజీపేటతో పాటు సహా ఆరు రైళ్లకు తాత్కాలిక స్టాప్‌లు ఉంటాయి.

హైటెక్ సిటీ, చర్లపల్లి స్టేషన్లు: నరసాపూర్–లింగంపల్లి, కాకినాడ టౌన్–లింగంపల్లి సహా మరో నాలుగు రైళ్లు రెండు స్టేషన్లలో ఆగుతాయి.

చర్లపల్లి స్టేషన్: సికింద్రాబాద్–దానపూర్, దానపూర్–సికింద్రాబాద్ రైళ్లకు తాత్కాలిక స్టాప్‌లను ప్రకటించారు.

లింగంపల్లి స్టేషన్: సికింద్రాబాద్–రాజ్‌కోట్, హైదరాబాద్–CST ముంబైతో సహా ఎనిమిది రైళ్లకు తాత్కాలిక స్టాప్‌లు ఏర్పాటు చేశారు.

## కన్నతల్లే కాల సర్పం అయ్యింది..

మొదటి పేజీ తరువాయి
ఈ విషాద ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన శిరీశ అనే తల్లి.. తన ఐదేళ్ల కుమారుడు మనీష్ కుమార్ ను చంపేసింది. ఈ కేసును 24 గంటల్లో ఛేదించారు పోలీసులు.

సెప్టెంబర్ 24న మనీష్ కుమార్ ను నైలాన్ తాడు తో మెడకు చుట్టి చంపేసింది తల్లి శిరీష. విచారణ తర్వాత కొడుకును చంపింది తానేనని ఒప్పుకున్న శిరీశను రిమాండ్ కు తరలించారు కేసముద్రం పోలీసులు.

విచారణ సందర్భంగా.. కొడుకును ఎందుకు చంపిందో చెప్పింది శిరీశ. భర్త తాగుడుకు బానిసై తననూ, తన పిల్లలనూ పట్టించుకోకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని భావించినట్లు పోలీసులకు చెప్పింది. తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళనలో.. పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది.

**జనవరిలో చిన్న కుమారుడిని నీటి సంపులో పడేసి..**

విచారణ సందర్భంగా పోలీసులకు షాకింగ్ విషయాలు చెప్పింది శిరీష. 2025 జనవరి నెలలో చనిపోయిన తన చిన్న కుమారుడు నిహాల్ (2) ను కూడా తానే చంపినట్లు ఒప్పుకుంది. ఆ తర్వాత మరో కుమారుడిని హత్య చేయాలనుకుంటే అప్పుడు ఆ బాలుడు బతికి బయటపడ్డాడు. చివరికి సెప్టెంబర్ 24 న మరో కుమారుడిని చంపేసి పోలీసులకు దొరికిపోయింది.

భర్త తాగుడుతో కొడుకులు ఏమైపోతారోననే కారణంతోనే ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు చెప్పిన తల్లి.. చంపేముందు చేతులెలా వచ్చాయో అర్థం కాని పరిస్థితి. కనీసం ఈమెకు భర్త అయినా ఉన్నాడు. కొందరు భర్తలు లేకపోయినా ఒంటరిగా కాయా కష్టం చేసి పిల్లలను పెద్దవాళ్లను చేసే తల్లులున్నారు. భర్త సహకారం లేకపోయినా వాళ్లను తీర్చిదిద్దాలనే ఆలోచన ఎందుకు రాలేదో. అంత దారుణమైన అనుభవిస్తుందో లేక.. చిన్న పాటి కష్టాలకు తట్టుకునే మనస్థైర్యం లేకో గానీ.. నవమాసాలు మోసీ జీవం పోసిన ఆ తల్లి.. ఆ చేతులతోనే ప్రాణాలు తీయడం ఘోర విషాదకరమైన ఘటన.

# మహిళల ఖాతాల్లో రూ.10వేలు

మొదటి పేజీ తరువాయి
మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పించడం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలో ఒక మహిళకు ఈ స్కీమ్ కింద రూ.10వేలు నేరుగా అందాయి . తర్వాత వివిధ దశల్లో ఆ సహాయం రూ.2 లక్షల వరకు ఉండనుంది. స్వయంఉపాధి కోసం పశుపోషణ, వ్యవసాయం, టైలరింగ్ వంటి రంగాల్లో ఆ మొత్తాన్ని ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.

అగ్రపీఠాలపై అతివలు..ఉద్యోగుల సంఖ్యలోనూ భారీ పెరుగుదల

ఈ కార్యక్రమం సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. “ఈ నవరాత్రి సందర్భంగా బిహార్ మహిళల సంతోషంలో నేనూ భాగమైనందుకు ఆనందంగా ఉంది. ఇక్కడ నాకు స్క్రీన్‌పై లక్షలాదిమంది మహిళలు కనిపిస్తున్నారు. వారి ఆశీర్వాదాలు మాకు గొప్ప బలం” అని పేర్కొన్నారు. “ప్రధానమంత్రి మోదీ మీకోసం పని చేస్తున్నారు. గత ప్రభుత్వం అలా కాదు. ఆయన (లాలూ ప్రసాద్ యాదవ్‌ను ఉద్దేశించి) సీఎం పదవిని కోల్పోయినప్పుడు.. తన సతీమణిని ముఖ్యమంత్రిని చేశారు. తన కుటుంబం గురించి మాత్రమే ఆందోళన చెందారు. మేం మాత్రం బిహార్ ప్రజలందరి కోసం పనిచేస్తాం” అని విపక్ష ఆర్జేడీపై నీతీశ్‌కుమార్ విమర్శలు చేశారు.

## ప్రజలను అప్రమత్తం చేయండి:

మొదటి పేజీ తరువాయి
పలు జిల్లాల్లో ఈరోజు, రేపు రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ఆయా జిల్లాల్లో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రమాదకర పరిస్థితులు ఉన్న చోట ముందస్తు హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హైడ్రాతో పాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తంగా ఉంచాలని, భారీగా నీరు చేరే ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మనకే అవకాశాలెక్కువ: కేసీఆర్

మొదటి పేజీ తరువాయి
ములుగు: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయని, ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకొని విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని మాజీ సీఎం, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పద్మారావు గౌడ్‌తోపాటు పలువురు నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్‌లో ప్రతి అంశం పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు అన్ని నివేదికలు చెబుతున్నాయని కేసీఆర్ అన్నారు. క్షేత్ర స్థాయిలో కిందిస్థాయి కార్యకర్తలను అప్రమత్తం చేసి తద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందన్నారు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు జూబ్లీహిల్స్ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణుల్ని అప్రమత్తం చేయాలని కేసీఆర్ సూచించినట్లు తెలుస్తోంది.

## హైదరాబాద్‌లో లగ్జరీ కార్ల డీలర్ బసరత్ ఖాన్ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలో లగ్జరీ కార్ల విక్రయాల డీలర్ బసరత్ ఖాన్ ఇల్లు, కార్యాలయంతో పాటు అతని స్నేహితుల ఇళ్లలో ఈడీ సోదాలు ముగిశాయి. దాదాపు 6 గంటలకు పైగా అధికారులు సోదాలు నిర్వహించారు. ఫెమా ఉల్లంఘన కేసులో బసరత్ ఖాన్‌ను ఇప్పటికే అహ్మదాబాద్ ఈడీ అధికారులు అరెస్టు చేశారు. రాజకీయ నాయకులు, వ్యాపారులకు ఆయన లగ్జరీ కార్లు అమ్మినట్టు ఈడీ గుర్తించింది. విదేశాల నుంచి తెచ్చిన కార్లకు పన్ను ఎగవేత ఆరోపణలతో ఈడీ సోదాలు చేపట్టింది. బసరత్ ఖాన్ ఎవరికి కార్లు విక్రయించారనే దానిపై కూడా ఈడీ అధికారులు ఆరా తీశారు. రూ.కోట్ల మేర కస్టమ్స్ మోసం కేసులో గతంలోనూ బసరత్ ఖాన్ అరెస్టయ్యారు.

ఈడీ దర్యాప్తును స్వాగతిస్తున్నాం: బండి సంజయ్

అక్రమ కార్ల దిగుమతులపై ఈడీ దర్యాప్తును స్వాగతిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. దేశ ఖజానాకు నష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విక్రేతలతోపాటు కొనుగోలుదారులపైనా విచారణ జరపాలన్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

మొదటి పేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీగా కురిసిన వానతో నగర వాసులు తడిసి ముద్దయ్యారు. వివిధ పనులపై బయటకు వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమాయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీటితో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

**మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి మూసీ వరద**

భారీ వర్షం వల్ల మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి మూసీ వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాలను.. పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. భారీ వర్షాలకు ఉస్మాన్ సాగర్ నిండిపోవడంతో పైనుంచి నీటిని దిగువ ప్రాంతాలకు వదలడంతో అంబర్‌పేటలోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను పూర్తిగా నిలిపివేశారు. దిల్‌సుఖ్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు దారి మళ్లించారు.

**జంట జలాశయాల్లోకి భారీగా వరద..**

ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలతో జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఈసా, మూసీ నదుల నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం జంట జలాశయాల్లోకి చేరడంతో అవి నిండుకుండలా మారాయి. గంటగంటకు వరద పెరుగుతుండటంతో జలమండలి అధికారులు రెండు జలాశయాల గేట్లను ఎత్తి మూసీలోకి వదులుతున్నారు. సాయంత్రం 4 గంటల వరకు ఉస్మాన్ సాగర్ 11 గేట్లు 7 ఎడుగుల మేర ఎత్తి 7,986 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.హిమాయత్ సాగర్ ఆరు గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి 6,103 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో మూసీలో వరద ప్రవాహం ఎక్కువైంది. నార్సింగి– మంచిరేవుల వద్ద రహదారిపై వరద నీరు పోటెత్తడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. పురానాపూల్, చాదర్ ఘాట్, ముసారాంబాగ్ వద్ద మూసీ నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మూసీకి వరద పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అఫ్జల్ గంజ్ వద్ద శివాజీ వంతెన కింద భూలక్ష్మి ఆలయ సమీపంలో నివసిస్తున్న 55 కుటుంబాలను గోడె–కి–ఖబర్ ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్లోకి తరలించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో వర్షాలతోపాటు మూసీలో వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ అధికారులతో సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే జలమండలి ఎండీ కూడా జంట జలాశయాల్లో వరద నీటి విడుదలపై వివరాలు ఆరా తీస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వచ్చే రెండు రోజులపాటు జలమండలిలో సిబ్బంది, అధికారులకు సెలవులు రద్దు చేసినట్లు ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. సెలవులో ఉన్న ఉద్యోగులంతా వెంటనే విధుల్లోకి చేరాలని ఆదేశించారు.

## 63 ఏళ్ల పాటు సేవలు.. మిగ్-21కు గుడ్‌బై

మొదటి పేజీ తరువాయి
ఈ రకం విమానం భారత్‌లో తొలిసారి అడుగుపెట్టింది కూడా ఈ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లోనే కావడం విశేషం. నాడు ‘ఫస్ట్ సూపర్ సోనిక్స్’గా వ్యవహరించే 28వ స్క్వాడ్రన్‌కు వీటిని మొదటిసారి అప్పగించారు. వింగ్ కమాండర్ దిల్బాగ్ సింగ్ దీనికి నాయకత్వం వహించారు. ఆ తర్వాత ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ స్థాయికి ఎదిగారు. ఇక మిగ్–21లు కూడా దాదాపు 60 ఏళ్లకు పైగా వాయుసేనకు సేవలు అందించాయి. ఇప్పుడు ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్వయంగా 23వ స్క్వాడ్రన్ చివరి సార్టిలో పాల్గొన్నారు. ఆయనతో పాటు స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ కూడా అందులో భాగమయ్యారు.ఎవరీ స్క్వాడ్రన్ లీడర్ ప్రియా శర్మ..? ఈ చివరి ప్రయాణానికి గుర్తుగా మిగ్‌లకు వాటర్ సెల్యూట్ చేశారు. తర్వాత వాటికి సంబంధించిన లాగ్‌బుక్‌ను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు ఎయిర్ చీఫ్ అందజేశారు. మిగ్–21 శకానికి ముగింపుగా ఈ ప్రక్రియ చేపట్టారు. ప్రత్యేక స్మారక పోస్టల్ కవర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. “ఎన్నో యుద్ధాల్లో మిగ్ పరాక్రమం చిరస్మరణీయం. 1971 యుద్ధం, కార్గిల్ వార్, బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్.. ఇలా ప్రతి సైనిక చర్యలో అది భాగమైంది. పాకిస్థాన్‌తో యుద్ధం సమయంలో ఢాకాలోని గవర్నర్ హౌస్ మిగ్ దాడిలో దెబ్బతింది. అది యుద్ధ ఫలితంపై ప్రభావం చూపింది. ప్రతి చరిత్రాత్మక మిషన్ తర్వాత ఈ యుద్ధ విమానం వల్ల దేశగౌరవం పెరుగుతూ వచ్చింది. ఈ దేశ పరాక్రమం, సైనికుల త్యాగాల సమాహారమే ఈ వీడ్కోలు కార్యక్రమం. ఈ జెట్.. భారత్–రష్యా సంబంధాలకు ఒక సాక్ష్యం” అని మంత్రి పేర్కొన్నారు.

## అమెరికా ప్రసంగం వివాదం..

### హైకోర్టులో రాహుల్ గాంధీకి చుక్కెదురు

మొదటి పేజీ తరువాయి
దీంతో రాహుల్ వ్యాఖ్యలపై విచారణకు మార్గం సుగమమయ్యింది. గతేడాది అమెరికా పర్యటనలో ఓ వర్గాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై వారణాసి ప్రత్యేక కోర్టు రివిజన్ పిటిషన్‌ను స్వీకరించింది. దీనిని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా..తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం దానిని తోసిపుచ్చింది.అమెరికా పర్యటనలో భాగంగా గతేడాది వర్జీనియాలో భారతీయ సంతతి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. కొన్ని వర్గాలు, భాషలు, మతాలను ఆర్ఎస్ఎస్ అభద్రతా భావానికి గురిచేస్తోందని ఆరోపించారు. ఇలా భారత్‌లో మత స్వేచ్ఛపైనే పోరాటం జరుగుతోందని, రాజకీయాల గురించి కాదన్నారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ముందు కూర్చొన్న వారిలో తలపాగాతో ఉన్న వ్యక్తిని ఉద్దేశిస్తూ– సిక్కులు తలపాగాలు, కడియాలు ధరించవచ్చా? వారు గురుద్వారాకు వెళ్లగలుగుతున్నారా? అనే వాటిపైనే భారత్‌లో ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. అన్ని మతాలకూ ఇదే పరిస్థితి తప్పడం లేదన్నారు. ఈ వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా తప్పుపట్టింది.

## వీలైనంత త్వరలోనే అమెరికాతో ఒప్పందం: వాణిజ్య శాఖ

మొదటి పేజీ తరువాయి
భారత్, అమెరికా లకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది.

వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి కి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ–ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.సుంకాలపై డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు.. వాటిపై 100 శాతం! ఇప్పటికే రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దానిపై ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ ట్రంప్ తాజాగా ఫార్మా ఉత్పత్తులపై టారిఫ్‌లు విధించారు. దీంతో పరిస్థితులు మరింత గందరగోళంగా మారాయి. అమెరికాలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15శాతం భారత్ సరఫరా చేసినవే. డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్, సన్‌ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి సంస్థల మొత్తం ఆదాయంలో 30–50శాతం అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు ట్రంప్ విధించిన టారిఫ్‌లతో అమెరికా మార్కెట్‌లో ఈ ఔషధాల ధరలు రెట్టింపు కానున్నాయి.

## ఎల్ అండ్ టీ నిష్క్రమణ.. తెలంగాణ ప్రభుత్వానికి మాయని మచ్చ: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి
తాము అధికారంలో ఉన్నప్పుడే ఎయిర్‌పోర్టు మెట్రోకు కూడా శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ఆర్ ఓఆర్ఆర్ నిర్మించినప్పుడు ఒక మంచి పని చేశారని, రోడ్డు పక్కన కొంత భూమిని అదనంగా వదిలారని చెప్పారు.“400కి.మీ మేర మెట్రో విస్తరణకు కేసీఆర్ ప్రణాళికలు రచించారు. దశలవారీగా మెట్రో విస్తరణకు గతంలో కేబినెట్ ఆమోదం తెలిపింది. అధికారంలోకి రాగానే రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేశారు. ఆయన తలచుకుంటే ఇప్పటికే ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తయ్యేది. భూసేకరణ ఇబ్బంది కూడా లేదు. ఎయిర్‌పోర్టు మెట్రో కొనసాగించాలని ఎల్ అండ్ టీ కోరింది. అందుకు రేవంత్‌రెడ్డి ఒప్పుకోలేదు.

అప్పటి నుంచే సీఎం, ఎల్ అండ్ టీ మధ్య గొడవ మొదలైంది. రేవంత్‌రెడ్డి వల్ల ఆ సంస్థ చాలా ఇబ్బంది పడింది. ఆయన వైఖరి వల్లే ఆ సంస్థ వెళ్లిపోతోంది. అనేక కష్టాలు ఎదుర్కొని ఎల్ అండ్ టీ .. మెట్రోను నడిపింది. దాని నిష్క్రమణ రాష్ట్ర ప్రభుత్వానికి మాయని మచ్చ. పెట్టుబడిదారులను సాక్షాత్తూ ముఖ్యమంత్రే బెదిరిస్తున్నారు. నియంతలా వ్యవహరిస్తున్నారు” అని కేటీఆర్ విమర్శించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 27 2025

# దేశద్రోహులకు హెచ్చరిక

## భారత జెన్ జెడ్ యువత దేశం కొరకు ఉద్యమిస్తోంది

శివ ప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

కర్ణాటక దార్వాడ్ లో ఉద్యోగాల కొరకు నిన్న లక్షలాది యువత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ప్రదర్శన చేసారు.
ఈ ప్రదర్శన చేసింది యువత,జెన్ జెడ్ యువత.
ఇది నిజమైన జెన్ జెడ్ తిరుగుబాటు.

- **లద్ధాక్ లో, యూపీ బరేలీ లో, గుజరాత్ గాంధీనగర్ లో మిగతా చోట్ల ఐ లవ్ మొహమ్మద్ అనే ప్రదర్శనలు ఈ జెన్ జెడ్ తిరుబాట్లు కావు**

మనదేశంలో ఇప్పుడు ఎక్కడ విన్నా Gen Z గురించే మాట్లాడుతున్నారు.
అసలు ఈ Gen Z అంటే ఏమిటి అని ముందు తెలుసుకుందాం.




- **1997 నుండి 2012 మధ్యన జన్మించిన తరాన్ని జన్ జెడ్ తరము అని పిలుస్తున్నారు. సంక్షిప్తంగా అర్థం చేసుకోవాలంటే ఇది ఇంటర్నెట్ మరియు ఐఫోన్ ల తరం**
- **భౌతిక లోకానికి దూరంగా పెరిగే ఒక ఊహాలోక తరిమిది. ఈ తరానికి లౌకిక జ్ఞానం తక్కువ అని చెప్పుకోవచ్చు. ఇంటర్నెట్ ద్వారా తమకు సర్వస్వం తెలుసు అనుకొని తమకు తాము హైస్కిల్డ్ మరియు సాంకేతిక అవగాహన కలిగిన వారమని భావించుకొని డిజిటల్ ప్లాట్ ఫామ్ తో ముడిపడిన తరమిది**

ఈ జెన్ జెడ్ తరం తమ ఆకాంక్షలకు తగ్గట్టుగా జీవించాలనుకునే ఒక నవ వర్గంగా పిలువబడుతున్నది. సామాజిక, రాజకీయ అవగాహన తక్కువగా కలిగిన ఈ జన్ జెడ్ తరం ఆవేశ తరంగాల్లో చిక్కుకోవడం సులువు.తృతీయ ప్రపంచ దేశాలలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న దేశాలను తమ గుప్పిట పెట్టుకోవడానికి సామ్రాజ్యవాద శక్తులు, ఆర్థిక ఆధిపత్య శక్తులు ఈ జెన్ జెడ్ తరాన్ని ఆయా దేశాల్లో తమ పావులుగా ఉపయోగించుకుంటున్నారు.

- **దానికి తాజా ఉదాహరణ శ్రీలంక, బంగ్లాదేశ్ మరియు నేపాల్ దేశాలు**

పాకిస్తాన్ లో కూడా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ను జైల్లో పెట్టి, కీలుబొమ్మ షాబాజ్ షరీఫ్ ను గద్దె పై కూర్చోబెట్టి మిలిటరీ పాలన సాగిస్తున్నది.
ఇవి మన పొరుగు దేశాలు. ఈ దేశాల్లో ప్రభుత్వాలు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైనవే.
పైకి ప్రజాస్వామ్యం అని పలవరించే ప్రగతిశీల వాదులు, జై సంవిధాన్ అంటూ రాజ్యాంగ పుస్తకం చేతిలో పట్టుకుని తిరిగేవారు ఎవరు కూడా ఈ ప్రజాస్వామ్య దేశాల పతనం గురించి కనీస సానుభూతి చూపలేదు.
Zen Z తరంలో 20 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఉంటారు
ఆయా దేశాల్లో అరాచక సామ్రాజ్యవాద శక్తుల ప్రభావానికి గురైన ఈ తరం గుంపుగా రోడ్డెక్కి పార్లమెంటు భవనాలను, అధికార నివాసాలను ఆక్రమించుకొని తగులబెట్టి సామాన్లు దోచుకుని తమ ఉద్యమం ఫలించిందని ఆనందపడే అమాయకతరం.
కేవలం సోషల్ మీడియా మెసేజ్ లకు ప్రభావితమయ్యే ఈ తరం ఉద్యమించి సాధించిందేమిటి?. ఈ యువతరాన్ని ఉసిగొలిపి లేనిపోని అపవాద ప్రచారంతో ప్రభుత్వాలనుకూలదోసే అమెరికా లోని శక్తులు, సోరోస్ గ్యాంగులు కలిసి చైనా సహాయంతో ఈ దేశాల్లో యువతరం ప్రభుత్వాలనే కూల్చింది.ఈ జెన్ జెడ్ తరం ఉద్యమించి తాత్కాలిక పాలకులుగా ముసలి వాళ్లను నియమించింది. బంగ్లాదేశ్ లో ఈతరం 80 ఏళ్ల యోనస్ కు పాలనా పగ్గాలు కట్టబెట్టింది అమెరికా.అదేవిధంగా నిన్న నేపాల్ లో ఉద్యమించిన జన్ జెడ్ తరం కూడా ఇదే చేసింది.
నేపాల్ లో సోషల్ మీడియాను బ్యాన్ చేసిన కమ్యూనిస్టు పాలకులపై తిరుగుబాటు చేసిన ఈ జన్ జెడ్ యువత అక్కడి పాలకులను కుర్చీ దించి అధికారాన్ని పాత తరానికి చెందిన రిటైర్డ్ సుప్రీంకోర్టు జస్టిస్ కు అప్పగించింది.
శ్రీలంకలో హంగామా సృష్టించిన ఈతరం వెనకాల అమెరికా సోరోస్ మరియు కమ్యూనిస్టు శక్తుల ఉమ్మడి వ్యూహం కారణమని ప్రపంచానికి




తెలిసిపోయింది.

- **ఈ శక్తులకు ఇంధనం మతోన్మాద శక్తులు**

బంగ్లాదేశ్ లో ఈ తిరుగుబాటును నడిపింది చాందస ఇస్లామిక్ శక్తుల ప్రాబల్యంలోని యువతరం.
శ్రీలంకలో అధికార పగ్గాలు చేపట్టిన నాయకుడు కమ్యూనిస్టు భావజాల ప్రేరితుడని లోకానికి తెలుసు.
ఇక నేపాల్ లో స్వయంగా పాలనలో ఉన్నది కమ్యూనిస్టులు.
ఈ కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య వ్యతిరేకులు.
ప్రజాభిప్రాయాన్ని కనీసం గౌరవించని నేపాల్ పాలక కమ్యూనిస్టు నేతలు సోషల్ మీడియాను నిషేధించారని రోడ్ ఎక్కిన జెన్ జెడ్ తరం అక్కడి ప్రధానమంత్రిని ఇతర మంత్రులను అవమానకర రీతిలో అధికారము నుండి దించేశారు.

- **ఇప్పుడు ఇదే ప్రక్రియను భారత్ లో కొనసాగించి కేంద్రంలో మోడీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోయాలని గత కొన్ని సంవత్సరాలుగా కుట్రలు జరుగుతున్నాయి**

భారతదేశంలో నరేంద్ర మోడీ తిరుగులేని ప్రజానాయకుడిగా ప్రజలచే కీర్తించబడుతున్నాడు.

- **మోడీని ఓడించలేము.. కాబట్టి పదవి నుంచి దించడం ఒక్కటే మార్గమని ఈ శక్తులు కుట్రలు చేస్తున్నాయి**

మనదేశ ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపు సాధించిన కాంగ్రెస్ నేత శ్రీ రాహుల్ గాంధీ ఈ పనిలో తల మునకలై ఉన్నాడు.మనము జాగ్రత్తగా విషయాలను గమనిస్తే ఎరికైనా ఈ విషయము సులభంగా అర్థమవుతుంది.2024 మే లో మోడీ గెలవకూడదని అమెరికా, సోరోస్ మరియు చైనా దేశాలు పాకిస్తాన్ ను ఉసిగొలిపి మన దేశంపై ఎన్నో కుట్రలు చేశారు.ఈ దేశీయ అంతర్జాతీయ కుట్రలను పసిగట్టిన మోడీ ఎలాగో అరకొర మెజారిటీ సాధించి మూడవసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టాడు.బంగ్లాదేశ్ లో తిరుగుబాటు జరిగి ఒక కీలుబొమ్మ అక్కడ పాలనా పగ్గాలు చేపట్టిన ఆనందంలో రాహుల్ గాంధీ మాట్లాడిన ప్రతి మాట రికార్డ్ అయి ఉన్నది.మోడీని ఇక్కడ యువకులు రోడ్డుపైన ఉరికించి, కర్రలతో కొడతారని రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు సాక్షాలు చూపుతాయి.రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ లోని షాహిన్ భాగ్ లో బూటకపు రైతులతో జరిగిన ప్రదర్శనలు ప్రపంచం చూసింది. ఢిల్లీకి రావలసిన సింగూ, టిక్రి మరియు ఘాజీపూర్ రహదారులను బ్లాక్ చేసిన తీరు మనకు తెలుసు.
అప్పుడు మోడీ ప్రభుత్వం గనుక రైతులపై బల ప్రయోగం జరిపినా, కాల్పులు జరిపినా దేశంలో అలజడి అశాంతి రేగే అవకాశాలు ఉన్నాయని గ్రహించిన ఇంటలిజెన్స్ వర్గాల సూచనతో కేంద్ర మోడీ ప్రభుత్వం రైతులతో మర్యాదగా శాంతంగా గంభీరంగా వ్యవహరించింది.
స్టార్ హొటల్ సౌకర్యాలతో లెక్కలేనంత డబ్బు గుమ్మరించి జరిపిన ఈ రైతు నిరసన ను లోకం చూసింది.
ఈ రైతు నిరసనలో దేశ వ్యతిరేక శక్తులు ఖలిస్తాన్ అనుకూల వ్యక్తులను ఉసిగొల్పి ఢిల్లీలోని ఎర్రకోట పై గల మన జాతీయ జెండాను దించి వేసిన విషయం మన జ్ఞాపకాల్లో పదిలంగా ఉంది.
2024 పార్లమెంటు ఎన్నికలకు ముందు నుండి జరుగుతున్న అన్ని కుట్రలను ఎదుర్కొంటూ సహనంతో మోడీ ప్రభుత్వం బాధ్యతగా పాలన సాగిస్తున్నది.

అనుకున్న కుట్రలు సాగడం లేదని మనదేశంలోని లుటియన్ మీడియా, కాంగ్రెస్ లోని విఘటనవాదులు, కమ్యూనిస్టులు, మతోన్మాదులు కలిసి భారతదేశంలో స్థిరమైన ప్రభుత్వం ఉండకూడదని చేయని ప్రయత్నం లేదు.
ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్యవాదులుగా చెప్పుకునే వీళ్ళందరూ కూడా అసహనంతో రగిలిపోతున్నారు. వీళ్ళందరూ కూడా అసహన వాదులుగా ముద్ర వేయించుకున్నారు.మన కేంద్ర ప్రభుత్వం స్థిరంగా ఉండకూడదు, మన దేశం బలంగా మారకూడదు అని కోరుకుంటున్న శక్తులు దేశంలోపల నక్సలైట్ మావోయిస్టులను కూడా కలుపుకొని అల్లకల్లోలం సృష్టించాలని కుట్టలు చేస్తూ వచ్చారు.మన దేశ రక్షణ దళాల ఉమ్మడి అధికారి కీర్తిశేషులు రావత్ అప్పుడు మాట్లాడుతూ మన భారతదేశం రెండున్నర యుద్ధాలకు సిద్ధంగా ఉందని ప్రకటించారు.పాకిస్తాన్ చైనా తో పాటు దేశంలోపల మావోయిస్టులను ఏకకాలంలో ఎదుర్కొనే శక్తి మన రక్షణ బలగాలకు ఉందని సగర్వంగా ప్రకటించాడు.పాకిస్తాన్ పెహల్గామ్ లో మత దృష్టితో హిందూ పర్యాటకులను చంపి మత విద్వేషాలు రెచ్చగొట్టి ఈ దేశంలో అరాచకం సృష్టించాలని ప్రయత్నం చేశారు.అదే




సమయంలో మావోయిస్టు అనుకూల శక్తులుగా పేరుపడ్డ పౌర హక్కుల సంఘాలు, విజ్ఞావంతుల వేదిక, ప్రజా సంఘాల పేరుతో శాంతి చర్చల నాటకం మొదలుపెట్టారు.రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తులైన మావోయిస్టు సాయుధ బలగాలను 2026 మార్చ్ నెల ఆఖరుకు తుద ముట్టిస్తామని కేంద్ర హెూంశాఖ మంత్రి స్వయంగా ప్రకటించాడు.

- **మన దేశ సరిహద్దుల్లో ఉండే సైన్యానికి, దేశంలోపల మావోయిస్టుల లాంటి శక్తులను ఎదుర్కొంటున్న సైన్యానికి ఆటంకాలు కలిగించడం కొరకు ఈ శాంతి చరిత్ర నాటకం తెరపైకి వచ్చింది**

శాంతి లేని సమాజం స్మశానంతో సమానం అని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం తమ రాజ్యాంగ విధిత బాధ్యతలను నిక్కచ్చిగా నెరవేరుస్తూ వస్తున్నది.

- **రోజురోజుకు ప్రజలతో మమేకమవుతూ బలపడుతూ వస్తున్న మోడీని ఇక ఓడించలేమని, ఎలాగైనా మోడీని అధికారుల నుంచి కూల దోయడం ఒక్కటే మార్గమని రాహుల్ గాంధీ కేంద్రంగా కుట్రలు జరుగుతున్నట్టుగా ఇంటలిజెన్స్ వర్గాలు ఖచ్చితమైన సమాచారంతో ప్రభుత్వాన్ని అలర్ట్ చేస్తూ వచ్చాయి. ప్రభుత్వము కూడా ఈ కుట్టలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది**

నేపాల్ లో మొన్న సంభవించిన జెన్ జెడ్ తరం తిరుగుబాటును భారతదేశంలో కూడా జరిగేలా చూడాలని ఈ అసహన శక్తులు నిరంతరం కృషి చేస్తున్నాయి. నేపాల్ లో జరిగిన తిరుగుబాటు తరువాత తాత్కాలిక ప్రధానిగా నియమించబడ్డ సుప్రీంకోర్టు మాజీ జస్టిస్ భారత అనుకూల వైఖరి ప్రదర్శించడం ఈ దేశంలోని అసహన వాదులకు పిచ్చి లేపింది.దానిలో భాగంగా జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలోని లధాక్ లో ఈనెల 24వ తేదీన జరిగిన హింసాత్మక ప్రదర్శనలు ఈ కుట్రలో భాగము.లద్దాక్ లో చైనా అనుకూల తొత్తుగా పేరుపడ్డ సోనం వాంగ్ చుక్ అనే వ్యక్తి మనదేశంలో ముఖ్యంగా లద్దాక్ లో అశాంతి రేపడానికి గత కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నాడు.లద్దాక్ చైనాకు అంటుకొని ఉండే భూభాగం. 2014 సంవత్సరానికి ముందు జమ్మూ కాశ్మీర్ లద్దాక్ లో భారత సైన్యానికి ఉపయుక్తమైన ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. మోడీ ప్రధానిగా ఎన్నికైన తరువాత ఈ లోపాన్ని సరి చేయడానికి లద్దాక్ ప్రాంతంలో చైనా బార్డర్ వరకు రోడ్లు, అక్కడ నివసించే స్థానిక ప్రజలకు సౌకర్యాలు మెరుగుపరిచే పనిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాడు. చైనా సైన్యము వేగంగా సరిహద్దుకు చేరుకోవడానికి రోడ్లు ఇతర సౌకర్యాలు ఏర్పరచుకొని మనదేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తుంటే, దానికి ప్రతిగా మనదేశంలో కూడా అదే విధమైన సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే ఈ వాంగ్ చుక్ అక్కడ పర్యావరణం పేరుతో ప్రభుత్వ కృషిని పనిని అడ్డుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. రాహుల్ గాంధీని కూడా లతా కు పిలిపించి సైకిల్ మోటార్ పై యాత్ర చేపట్టడానికి తగిన ఏర్పాటు చేశాడు. ఈ వాంగ్ చుక్ తండ్రి కాంగ్రెస్ నాయకుడు. ఇతడు కూడా కాంగ్రెస్ అనుకూల చైనా అనుకూల అమెరికా అనుకూల పొత్తు.
ఈ వాంగ్ చుక్ ఒకసారి ఇంజనీర్ గా, ఒకసారి పర్యావరణ వేత్తగా, ఒకసారి ప్రజా నాయకుడిగా,




మరొక్కసారి ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య వాదిగా వివిధ రూపాల్లో దర్శనమిస్తుంటాడు.
ఇతనికి మనదేశంలోని లుటియన్ మీడియా, వామపక్ష మీడియా, కాంగ్రెస్ నాయకత్వంలోని ఉదార రాజ్యాంగ ప్రజాస్వామ్య శక్తులు కలిసి ఇతడిని ఉసి గొలుపుతూ ఉంటాయి.

- **ఇక ఇప్పుడు అసలు విషయానికి వస్తే, నేపాల్ లో జరిగిన ప్రజా తిరుగుబాటును లద్ధాక్ లో ప్రారంభించి దేశంలో ఒక అస్థిర అశాంతి వాతావరణాన్ని సృష్టించడానికి పావుగా ఉపయోగపడ్డాడు**

నేపాల్ లో జరిగినట్టుగా భారతదేశంలో కూడా జన్ జెడ్ తరం అశాంతితో రగిలిపోతున్నదని ఒక బూటకపు ఆందోళనను ప్రారంభించాడు.

- **భారతదేశంలో ఇప్పటికీ హిందువుల మెజారిటీ ఉన్నది. బంగ్లాదేశ్ శ్రీలంక లాగా మన దేశంలో ప్రజా తిరుగుబాటు సాధ్యం కాదని భావించిన దేశ వ్యతిరేక శక్తులు ఇస్లామిక్ మతోన్మాద శక్తుల సహకారంతో అలజడులు రేపాలని ప్రయత్నం జరుగుతున్నది**

మొన్న లద్దాక్ లోని లేహ్ లో జరిగిన హింసాత్మక సంఘటనలో సి ర్ పి ఎఫ్ జవాన్ల వాహనాలు, హిల్ కౌన్సిల్ కార్యాలయ భవనం, ప్రజల వాహనాలు దహనం చేయడంతో పాటు బిజెపి కార్యాలయాన్ని కూడా దహనం చేశారు. కాల్చి బూడిద చేశారు.

- **ఇదే సమయంలో దేశంలో పలుచోట్ల ఐ లవ్ మొహమ్మద్ పేరుతో ప్రదర్శనలు జరుగుతున్నాయి**

ప్రవక్త మహమ్మదును ప్రేమించడం లో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదు. ఐ లవ్ మొహమ్మద్ అనే వారి వ్యక్తీకరణ స్వాగతించదగ్గది.దసరా దీపావళి పర్వదినాల సందర్భంగా ముస్లింలు వీధుల్లో గుంపులుగా చేరి ఐ లవ్ మొహమ్మద్ అంటూ ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శన చేసిన ఎవరికి అభ్యంతరం లేదు. కానీ ఈ ప్రదర్శన కారులు రాళ్లతో ప్రజలపై దాడి చేయడం ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడము ఇప్పుడు ప్రజల్లో ఒక ఆలోచనను ఆందోళనను ప్రతీకారాత్మక భావాన్ని రేపడమే కదా!..
గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ దగ్గరలో గల దేగాం తాలూకాలోని బహియాల్ అనే గ్రామంలో దాండియా ఆడుకుంటున్న ఆడవారిపై అకస్మాత్తుగా ఈ ప్రదర్శన కారులు ఇస్లామిక్ శక్తులు దాడి చేసి రాళ్లతో కొట్టి, అక్కడ ఉన్న వాహనాలను తగలబెట్టి, హిందువుల దుకాణాలను ఎంచుకొని మరి కాల్చి బూడిద చేసిన సంఘటన దేనికొరకు?
ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని బరేలిలో ఇస్లామిక్ జిహాదీ శక్తులు నిన్న శుక్రవారం నమాజ్ అనంతరం రోడ్లపైకి వచ్చి హిందువులను టార్గెట్ చేసి, రాళ్లతో దాడులు చేసి కార్లను దుకాణాలను కాల్చివేసింది ఎందుకు?. పోలీసు బలగాలపై దాడులు చేస్తున్నది ఎందుకు?..
మొహమ్మద్ ప్రవక్తను ప్రేమించడం కీర్తించడం నేరం కాదు. కానీ మత బలంతో ఊరేగే మతోన్మాద శక్తుల ఆగడాలు ఇలా కొనసాగాలని ప్రజాస్వామ్య వాదులు ఎవ్వరూ కోరుకోరు.
లద్ధాక్, లేహ్ లో సెప్టెంబర్ 24వ తేదీన జరిగిన హింసాత్మక సంఘటన నిజ రూపం బయటపడింది.
స్థానిక సమస్యల పేరుతో ఒక ప్రదర్శన నిర్వహించిన సోనం వాంగ్ చుక్ లేహ్ లో ప్రదర్శన చేసిన స్థానిక యంత్రాంగము ప్రభుత్వము కేంద్ర ప్రభుత్వము ఎవరు అడ్డు చెప్పలేదు.కానీ దేశాన్ని అల్లకల్లోలం చేయాలని కుట్రతో దాదాపు ఒక వంద 50 మంది నేపాలీ యువకులను రహస్యంగా పిలిపించి ఈ ప్రదర్శనలో జొప్పించారని నిఘా వర్గాలు గుర్తించాయి. వందలాది వేలాదిమంది గుమిగూడిన చోట సహజంగా భావోద్వేగాలు ఉంటాయి. తమ డిమాండ్లను తెలుపుతూ ప్రజలను రెచ్చగొట్టి ఒక ఆవేశాన్ని రగిలించినప్పుడు నేపాల్ నుండి వచ్చిన ఈ వ్యక్తులు ఈ హింసాత్మక సంఘటనలను జరిపినట్టుగా సాక్షాలతో సహా మన పోలీసులు




రక్షణ బలగాలు నిరూపించాయి.
సీసీటీవీ ఫుటేజ్ లో నేపాలి యువకులు మూతికి మాస్క్ కళ్ళకు అద్దాలు పెట్టుకొని చేతిలో మారణాయుధాలు పట్టుకొని తిరిగిన దృశ్యాలు స్పష్టంగా ఈ బూటకపు తిరుగుబాటును పట్టిచూపాయి.
లద్ధాక్ లో బూటకపు పర్యావరణ వాది వాంగ్ చుక్ అసలు రూపం బయటపడింది.
ఈ వాంగ్ చెక్ ఎన్జీవోల పేరు మీద విదేశాల నుంచి అక్రమ మార్గంలో డబ్బు పొంది ఇక్కడ లద్దాక్ లో దేశ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నాడని రుజువు లభించాయి. అతనిప్పుడు ఎన్ ఐ ఏ ఆధీనంలో ఉన్నాడు.




హింసాత్మక సంఘటనకు పాల్పడిన నేపాల్ యువకులు దాదాపు 55 మంది పోలీసుల అదుపులో ఉన్నారు. అదేవిధంగా కొందరు స్థానిక యువకులు కూడా పోలీసుల అదుపులో ఉన్నారు.

- **ఇటు లద్ధాక్ లో, అటు యూపీ గుజరాత్ తో పాటు దేశంలోని మిగతా ప్రాంతాలలో ఐ లవ్ మొహమ్మద్ ప్రదర్శనలు దేశంలో అశాంతి కారణమవుతున్నాయని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు**

బాధ్యతారహితంగా రాహుల్ గాంధీ ఈ విదేశీ కుట్రలకు పావుగా మారాడని బలమైన విమర్శలు వినిపిస్తున్నాయి.
రాహుల్ గాంధీ జెన్ జెడ్ తరం విప్లవిస్తే వారి వెంట ఉంటానని చేసిన ప్రకటన ఇప్పుడు అతనికే చుట్టుకుంటున్నది.

- **నిన్న కర్ణాటకలోని ధార్వాడ్ లో లక్షలాదిమంది యువకులు కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకంగా భారీ ప్రదర్శన చేశారు**

వీరంతా జెన్ జెడ్ తరం కు చెందినవారు.పోలీసు ఉద్యోగాల్లో నియామకాలు లేకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, దానివల్ల వయస్సు పెరిగి మేము అర్హత కోల్పోతామని ఆగ్రహించిన వేలాది లక్షలాది జెన్ జెడ్ తరం నిన్న కర్ణాటకలోని ధార్వాడ్ లో కవాతు నిర్వహించింది.

- **భారతదేశంలో నూతన యువతరం జెన్ జెడ్ తిరుగుబాటుకు అవకాశాలు లేవని భావించిన రాహుల్ గాంధీ మరియు అతని బాసులు అమెరికా షోరోస్ లు విదేశీ శక్తులను కిరాయి మనుషులను మతోన్మాద ఇస్లామిక్ శక్తులను రోడ్డు పైక లాగి మనదేశంలో అశాంతి ఉన్నట్టుగా భ్రమ కల్పించి ప్రజలను రెచ్చగొట్టడానికి కృషి చేస్తున్నారు**

మోడీని కేంద్ర ప్రభుత్వ పని తీరు పట్ల మెజారిటీ ప్రజలు ముఖ్యంగా యువకులు సానుకూల ధోరణితో ఉన్నారు. వీళ్ళతో అనుకున్న తిరుగుబాటు సాధ్యం కాదని నేపాల్ నుంచి కిరాయి మనుషులను, దేశంలోని జిహాదీ ఇస్లామిక్ శక్తులను రోడ్డుపైకెక్కిచి మత విద్వేషాలు రగిలించడం ఒక్కటే మార్గమని భావిస్తున్నారు.
**వారి కుట్రల ఫలితమే లద్ధాక్, బరేలి హింసాత్మక సంఘటనలు.**
మత ప్రాతిపదికన విడిపోయిన మన భారతదేశం లో మళ్లీ మత ప్రాతిపదికన అల్లర్లు లేపి మన భారతదేశాన్ని అల్లకల్లోలం చేయడానికి జరుగుతున్న కుట్రలను ఈ జన్ జెడ్ తరం అడ్డుకొని తీరుతుంది.దేశ వ్యతిరేక కార్యకలాపాలకు కాకుండా దేశద్రోహులపై తిరుగుబాటు చేయడానికి భారత యువత జెన్ జడ్ తరం యువత ఇప్పుడు సంసిద్ధమై ఉంది.
దేశ ప్రధాని మోడీ ని కర్రలతో రోడ్డుపై ఉరికించి కొడతారని బాధ్యత లేకుండా మాట్లాడిన రాహుల్ గాంధీకి ఆ పరిస్థితి రాకుండా ఉండాలని అందరము కోరుకుందాం.చెడపకురా చెడేవు అనే నానుడి రాహుల్ గాంధీ విషయంలో నిజం కాకూడదని భావిద్దాం.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 27 2025

# కలెక్టరేట్ లో రైల్వే, మున్సిపల్, కుడా, తదితర అభివృద్ధి పనులపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్, అధికారులు

■ జిల్లా అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను అందజేసినట్లయితే కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తా

- ఎంపీ డా. కడియం కావ్య





**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 26**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన రైల్వే , మున్సిపల్, కుడా పరిధిలో వివిధ అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కాజీపేట, హనుమకొండ పరిధిలో రైల్వే వంతెనలు, పైపులైన్లు, రోడ్లు, తాగునీటి సమస్యలు, ఎఫ్ సీ ఐ గోదాం, అంబేద్కర్ భవన్, హనుమకొండ చౌరస్తాలలో వరద నీరు నిలవడంతో తలెత్తుతున్న ఇబ్బందులు, భద్రకాళి దేవాలయం వద్ద పార్కింగ్ సమస్య, అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. రైల్వే సంబంధిత అంశాలను, సమస్యలను తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. ఇటీవల హైదరాబాద్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో తాను పాల్గొని మాట్లాడినట్లు పేర్కొన్నారు. అక్కడి సమావేశంలో కాజీపేటలో బస్టాండ్ ఏర్పాటు అంశం కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. రైల్వేకు సంబంధించి ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుందామన్నారు. అభివృద్ధికి సంబంధించిన అంశాలు, ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపి సమన్వయంతో పరిష్కరించే విధంగా జిల్లా అధికారులను కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లు వేయాలని తన వద్దకు ప్రజలు వస్తున్నారని ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలలో రోడ్లు వేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వరద నీరు నిలవకుండా తీసుకునే చర్యలపై ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

దిశ సమావేశంలో నూ వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడే విధంగా జిల్లాకు సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ మంజూరు అయ్యిందని పేర్కొన్నారు. సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ కోసం ప్రభుత్వ భవనం కావాల్సి ఉందని, త్వరగా బిల్డింగ్ ఇచ్చినట్లయితే ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. దేశవ్యాప్తంగా 22 సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్లను కేంద్రం మంజూరు చేసింది అని, అందులో ఒకటి వరంగల్ కు మంజూరు చేసిందన్నారు.రైల్వే, దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన ప్రసాద్ పథకం, యూనివర్సిటీలలో అభివృద్ధికి సంబంధించి ప్రతిపాదనలు అందించినట్లయితే వాటిని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డి ఆర్ ఓ వై వి గణేష్, ఆర్డిఓ రాథోడ్ రమేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు,కాజీపేట, హనుమకొండ తహసీల్దార్లు భావు సింగ్, రవీందర్ రెడ్డి, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర అత్యంత కీలకం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



**కరపత్రం ప్రతినిధి కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26**

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ సముదాయం 8వ బ్లాక్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సంక్షేమ సంఘాలు వారధులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నూతన కమిటీకి అభినందనలు తెలియజేస్తూ, సమాజ అభివృద్ధి దిశగా ప్రజా ప్రతినిధులతో కలసి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 8వ బ్లాక్ నూతన చైర్మన్ సౌమ్య, వైస్ చైర్మన్ దమయంతి, ప్రధాన కార్యదర్శి తస్లీమ్ బేగం, కోశాధికారి ప్రమీల, సభ్యులు అమ్ములు తదితరులు పాల్గొన్నారు...

## ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

**కరపత్రం ప్రతినిధి కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26**

125 – గాజుల రామారం డివిజన్ ప్రొఫెసర్ జయశంకర్ నూతన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు శుక్రవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ మాట్లాడుతూ – "ఐకమత్యంతోనే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అని అన్నారు. కాలనీ వాసులంతా ఒక్కతాటిపై ఉంటే మాత్రమే అన్ని రకాల సౌకర్యాలు, మౌలిక వసతులు వేగంగా అందుబాటులోకి వస్తాయి" అని తెలిపారు. ప్రజల సహకారమే సమగ్ర అభివృద్ధికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, చందు సుంకరి, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, దులప్ప, నవీన్, శివా నాయక్, ప్రసాద్, గౌస్, నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులు బి.సంగమేశ్ (మహేష్), ఉపాధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి శరణప్ప, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రభాకర్ ఇతర సభ్యులు పాల్గొన్నారు...

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది విజయదశమి ఉత్సవ ఆహ్వాన పత్రికను స్వీకరించిన బిజెపి కార్పొరేటర్ రావుల శేషగిరి

**కరపత్రం ప్రతినిధి కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి కి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 100 సంవత్సరాల సందర్భంగా నిర్వహించనున్న విజయదశమి ఉత్సవ ఆహ్వాన పత్రికను కూకట్పల్లి శ్రీనివాస్ నగర్ బస్తి ప్రముఖ్ క్రాంతి కుమార్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సాయి నేత, సంగ్ నిర్వాహకులు బాబు గారు, త్రిభువన్ గారు, శివ పాల్గొని విజయదశమి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. వచ్చే తరాలకు దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలను చేరవేయడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు...

## బతుకమ్మ చీరల పంపిణీలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**కరపత్రం ప్రతినిధి బెజ్జంకి సెప్టెంబర్ 26**

బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిదాని, బతుకమ్మ చీరలను ఆడపడుచులకు అందించడంలో విఫలమయిందని బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ లింగాల నిర్మలలక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పత్రిక సమాజంలో మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ప్రపంచానికి చాటి చెప్పాలా రాష్ట్ర పండుగగా జరుపుకున్నామన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 నుంచి ప్రతి ఏడాది మహిళలకు బతుకమ్మ చీరలను కానుకగా అందించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణసాంప్రదాయాన్ని కొనసాగించడంలో విఫలమైందని విమర్శించారు. బతుకమ్మ పండుగకు రెండు చీరలు పంపిణీ చేస్తామని ఒకే చీర ఇస్తామా అనడం మహిళలను నిరాశకు గురిచేసిందన్నారు. మహిళా సంఘాల్లో ఉన్నవారికే ఇస్తానడం సరికాదన్నారు, అబద్దాలతో మోసం చేసి, గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజులలో భంగపాటు తప్పదని హెచ్చరించారు.

# పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి

▪ ఆటంకపరిస్తే న్యాయపరంగా దేనికైనా సిద్ధం

▪ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి





**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 26**

గ్రామ ప్రజల అభివృద్ధి మంచి కోసం అనాదిగా వస్తున్న పోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించిన వారికి వెన్నుదన్నుగా నిలవాలని అభివృద్ధికి సహకరించకుండా ఆటంకపరిస్తే న్యాయబద్ధంగా దేనికైనా పోరాడుతామని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి చారి అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం కునూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన పోచమ్మ గుడిని పూర్వ వైభవంలోకి తేవాలని విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన ఆలయ నిర్మాణ దాత నాగరాజు సుమారు రూ. 15 లక్షలతో గుడిని నిర్మించి సౌకర్యాలు కల్పించినట్లు గ్రామస్తులు తెలిపారు. కొందరు గుడి లో తమకు బాధ్యత వాటా ఉందని అనడంతో విశ్వబ్రాహ్మణ కుల సంఘం సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, న్యాయబద్ధంగా విశ్వబ్రాహ్మణులు నిర్మించిన ఆలయానికి వారే ధూప దీప నైవేద్యాలు సమర్పించి సౌకర్యాలు కల్పిస్తున్న వైనం అనాదిగా వస్తున్నదని గ్రామస్తులు తెలిపారు. పోచమ్మ ఆలయం పై నెలకొన్న వివాదంపై ""తెలంగాణ తొలి మెట్టు " స్థానిక సమస్య పై పలువురిని వివరాలు సేకరించింది. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న వివరాలను విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పలు వివరాలు వెల్లడించారు జఫర్గఢ్ మండలం కూనూరు లో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్కు వచ్చి వారి సమస్యలను తెలపడంతో పాటు న్యాయపరంగా పోరాడుతామని పోలీసులకు లిఖితపూర్వకంగా వారి తీర్మానం ఫిర్యాదును అందజేశారు. జఫర్గఢ్ మండలంలో జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతి చారి మాట్లాడారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన గుడి కనుమరుగవుతున్న నేపథ్యంలో ఆలయ నిర్మాణాన్ని చేపట్టి వెలుగులోకి తెస్తున్న క్రమంలో అభివృద్ధిని కి సహకరించాల్సిన సమయంలో కొందరు కావాలని ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన విశ్వబ్రాహ్మణులకు సహకరించాలనీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి కోరారు. జఫర్గఢ్ మండలంలో జరిగిన విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి, హన్మకొండ జిల్లా అధ్యక్షులు శృంగారపు వెంకటేశ్వర్లు లు మాట్లాడారు.

కునూరు గ్రామంలో గతంలో శిథిలావస్థకు చేరిన పోచమ్మ గుడిని చూసి చలించిన దాత నాగరాజు రూ. 15 లక్షలతో పోచమ్మ ఆలయాన్ని నిర్మించి సౌకర్యాలు కల్పించారన్నారు ఆలయంలో తరతరాలుగా ఆచారాల ప్రకారంగా విశ్వబ్రాహ్మణులు పూజలు నిర్వహిస్తారని ఆలయం నిర్మించిన దాతతో పాటు సహకరించిన సభ్యులు గుడికి పూజలు అందిస్తుండగా కొందరు కుమ్మరి కులస్తులు తమకు వాటా ఉంటుందని ఆలయ అభివృద్ధిని అడ్డుకునే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు ఇది సరైంది కాదని వారు ఖండించారు. గ్రామ అభివృద్ధి కోసం సహకరించవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆలయాన్ని నిర్మించి పూజలు నిర్వహించే విశ్వ బ్రాహ్మణులను కొందరు వ్యతిరేకిస్తున్నారని ఇది సరైన కాదని, ఇలాగే అడ్డువస్తే తాము దేనికైనా న్యాయబద్ధంగా పోరాడేందుకు సిద్ధమని రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి హెచ్చరించారు. న్యాయపరంగా చట్టపరంగా దేనికైనా తాము ముందు ఉంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం విశ్వబ్రాహ్మణులు సహకరిస్తున్నారని మంచికి ప్రతి ఒక్కరు తోడుగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు శృంగారపు వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు బాలోజీ భద్రయ్య, సిద్ధోజు రమేష్ ,గ్రామస్తులు శంకపల్లి మురళి, శంకపెల్లి సమ్మయ్య, రాజు, శంకపల్లి విష్ణు, పోతోజు నరసయ్య, ఎల్లా చారి శంకపల్లి ఆంజనేయులు, కసివోద్దుల రమేష్ పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ జయంతి



▪ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంపీ కడియం కావ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తదితరులు







**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 25**

వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని శు క్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ న్యూ శాయంపేట జంక్షన్ వద్ద ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, ఇతర అధికారులు, కుల సంఘాల నాయకులు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మాచిదేవ ట్రస్ట్ భవనంలో వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్, తదితరులు పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కుల సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు

# స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబర్26 :**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విదేశీ పర్యటనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెళ్లనున్నారు. విదేశీ పర్యటనకు ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు భేటీ– కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.